తేల్చుకుందాం రా.. బ్రోకర్ లం..కొడకా..!

హుజూరాబాద్ నుంచి బతుకనీకి వచ్చావ్..

కౌశిక్‌రెడ్డిపై అరికెపూడి గాంధీ బూతులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి సవాల్ విసురుతూ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడిన బూతులు విమర్శలకు దారితీస్తోంది. గాంధీ మాట్లాడిన మాటలు ఇలా ఉన్నాయి. 'నా మీద సవాల్ విసిరిన బ్రోకర్ కౌశిక్‌రెడ్డిగా.. ధైర్యముంటే రా నా కొడకా.. 11 గంటలకు నువ్వు రాకపోతే నేనే 12 గంటలకు నేనే వస్తా.. బ్రోకర్ లం..కొడకా.. నువ్వో నేనో తేల్చుకుందాం రా బాంచెత్..! దేనికైనా సిద్ధం నాకొడకా..! హుజూరాబాద్ నుంచి బతకనీకి వచ్చిన దుర్మార్గుడు నా ఇంటిమీద జెండా ఎగురవేస్తానంటే.. ఎగురేయించుకోవాల్నా.. పోలీసులు.. మీడియా ఆపినా వాడి సంగతి తేలుస్తా.. హైదరాబాద్ నుంచి ఢిల్లీ దాకా బ్రోకరిజం చేసిన బ్రోకర్ నాకొడుకు.. నామీద సవాల్ విసిరితే నేను చేతగానివాడినా..! ఈ బ్రోకర్‌నాకొడుకు కోసం పదిరోజులు నా గాంధీ పేరును పక్కన పెట్టి వాడో నేనో తేల్చుకుంటా.. కౌశిక్ రెడ్డి ఒక బ్రోకర్, ఒక కోవర్టు, దుర్మార్గుడు..! బీఆర్ఎస్ లో బ్రోకర్ లం..కొడుకులు చేరినాక ఆ గౌరవం లేని బ్రోకర్లతో సంసారం చేయగలుగుతామా.. అలాంటి ఇంకో ముగ్గురు ఉన్నారు..! దుర్మార్గుల మూలానే ఆ పార్టీ అపోజిషన్‌లో కూర్చుంది. కౌశిక్‌రెడ్డిలాంటి బ్రోకర్లతో పార్టీకి నష్టమని..ఆంబోతులను మీడియా ముందు వదిలినప్పుడు ఆలోచించుకోవాలని అన్నారు. గాంధీ ఇలా రెచ్చగొట్టే విధంగా మీడియా ముందు మాట్లాడుతుంటే ఆయన అనుచరులు రెచ్చిపోయి ఏడున్నవ్‌వీరా కౌశిక్.. దమ్ముంటే రారా నా కొడకా..అంటూ నినాదాలు చేశారు.

ఎమ్మెల్యే గాంధీ క్షమాపణ చెప్పాలి

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఎమ్మెల్యే గాంధీ విద్వేష వ్యాఖ్యలు చేశారు. 'హుజూరాబాద్ నుంచి నా నియోజకవర్గానికి బతకనీకి వచ్చావ్' అంటూ వ్యాఖ్యానించారు. దీనిపై ప్రజలు మండిపడుతున్నారు. 'హుజూరాబాద్ వేరే దేశంలో ఉందా?.. శేరిలింగంపల్లికి రావాలంటే నీ అనుమతి తీసుకోవాలా?' అని ప్రశ్నిస్తున్నారు. అన్ని ప్రాంతాలకు చెందిన వారు శేరిలింగంపల్లిలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారని, వారందరినీ అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు ఓట్లేసిన వారిలో కూడా అన్ని ప్రాంతాలవారు ఉన్నారని, అందరినీ బతకనీకి వచ్చినవారే అని అవమానించినట్టేనని చెప్పున్నారు. బేషరతుగా అందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఇంటిపై దాడి ప్రభుత్వ వైఫల్యమే

- గాంధీని, అనుచరులను అరెస్టు చేయాలి
- రాహుల్ ఇంటి ముందు ధర్నా చేస్తాం
- శాంతిభద్రతలు అదుపు తప్పాయి
- సీఐ, ఏసీపీని సస్పెండ్ చేయాలి
- దాడిని స్పీకర్ సుమోటోగా స్వీకరించాలి
- మాజీ మంత్రి టీ హరీశ్‌రావు

హైదరాబాద్/సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి ప్రభుత్వ వైఫల్యమేనని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతోనే ఈ దాడి జరిగిందని మండిపడ్డారు. ఈ దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, దాడికి ఉసిగొల్పిన ఏసీపీ, సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను స్పీకర్ సుమోటోగా స్వీకరించి, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కౌశిక్‌రెడ్డిపై అరికెపూడి గాంధీ అనుచరులు గురువారం దాడి చేసిన అనంతరం మాదాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి ఇంట్లో ఆయనను హరీశ్‌రావుతోపాటు పలువురు మాజీ మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పలువురు పార్టీ నేతలు పరామర్శించారు. అనంతరం సైబరాబాద్ అడిషనల్ సీపీ జోయల్‌డేవిస్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. పోలీసుల నుంచి సరైన స్పందన లేకపోవడతో బీఆర్ఎస్ నాయకులు అక్కడే బైఠాయించారు. దాడి చేసినవారిని అరెస్టు చేసే దాకా సీపీ ఆఫీస్ నుంచి కదిలేది లేదని హెచ్చరించారు. అనంతరం పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లోనే పోలీసుల ఆధ్వర్యంలో కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి జరిగిందని ఆరోపించారు. హైదరాబాద్‌లో పట్టపగలు తమ పార్టీ ఎమ్మెల్యే ఇంటిపై రాళ్లు, కత్తులు, కర్రలతో దాడి చేశారని, ఇది ప్రభుత్వ వైఫల్యమేనని చెప్పారు. పోలీసుల వైఫల్యం వల్లే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి జరిగిందని, దీనికి కారణమైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, లేదంటే సీబీఐ విచారణ జరపాలని కోరుతామని, అవసరమైతే కోర్టుకు వెళ్తామని ప్రకటించారు. కేంద్ర హోంశాఖ వద్దకు కూడా వెళ్తామని, నిజనిజాలు బయటకు రావాలని స్పష్టంచేశారు. ఈ దాడి వెనుక పాత్రదారులు, సూత్రదారులు, సహకరించినవారు ఎవరో అన్నీ బయటకురావాలని అన్నారు. శాంతిభద్రతలను కాపాడాలనే ఉద్దేశం ఉంటే ఈ ఘటనపై సీపీ, డీజీపీ ఉన్నతస్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ దాడిని ఆపలేక, దగ్గరుండి దాడి చేయించిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన గూండాలకు నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో రాచమర్యాదలు చేస్తున్నారదని ఆరోపించారు. లా అండ్ ఆర్డర్‌ను కాపాడేందుకే ప్రతిదాడులు చేయడం లేదని స్పష్టంచేశారు. పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నామని, దాడులకు భయపడబోమని చెప్పారు.

ఇదేనా ప్రజాపాలన?

సమాధానం చెప్పలేక, కాంగ్రెస్ వైఫల్యాలను ఒప్పుకోలేక, కౌశిక్‌రెడ్డి అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం లేకనే భౌతికదాడులకు పాల్పడుతున్నారని హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఇదేనా ప్రజాపాలన, ఇదేనా ప్రజాస్వామ్యం? అని నిలదీశారు. మొన్న సిద్దిపేటలో తన క్యాంపు కార్యాలయంపై దాడి జరిగిందని, ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్తే తమపై దాడి చేశారని చెప్పారు. ఖమ్మంలో దాడి ఘటనపై ఇంతవరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని దుయ్యబట్టారు. కౌశిక్‌రెడ్డి ప్రజాస్వామ్యం, హైకోర్టు తీర్పు గురించి మాట్లాడారని, గాంధీని రాజీనామా చేయాలని కోరారని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు గాంధీ చెప్పింది నిజం కాదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. పీఏసీ చైర్మన్ కాగానే తాను ప్రతిపక్షంలో ఉన్నానంటూ గాంధీ సిగ్గు లేకుండా ప్రకటనలు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. తమ ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేసి పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

హైదరాబాద్ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న రేవంత్

పదేండ్ల కేసీఆర్ పాలనలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచితే, రేవంత్‌రెడ్డి సర్కార్ నగర ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయని, హైదరాబాద్‌లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం కుదేలు అయిందని, పెట్టుబడులు తరలిపోతున్నాయని దుయ్యబట్టారు. కాంగ్రెస్ 9 నెలల పాలనలో 1,800 లైంగికదాడులు, 2,600 హత్యలు, తొమ్మిది మత ఘర్షణ లు జరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేకే రక్షణ లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. ఇది రేవంత్‌రెడ్డి వైఫల్యమని స్పష్టం చేశారు. తమకు తెలంగాణ ప్రజలు, హైదరాబాద్ ప్రతిష్ఠ ముఖ్యమని, సహనా న్ని చేతగాని తనంగా భావించవద్దని హెచ్చరించారు. డీజీపీ, సీపీలు చట్టాన్ని రక్షించాలని విజ్ఞప్తిచేశారు. ప్రభుత్వానికి కొమ్ముకాసే అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రాహుల్‌గాంధీ స్పందించాలి

రాజ్యాంగం పట్టుకొని తిరుగుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి రాజ్యాంగంపై నమ్మకం ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని హరీశ్‌రావు సవాల్ చేశారు. రేవంత్‌రెడ్డిని రాహుల్ గాంధీ మందలిస్తారా? చర్యలు తీసుకుంటారా? అని నిలదీశారు. ఎమ్మెల్యేలపై దాడి చేయడం, ప్రశ్నించిన జర్నలిస్టులు, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై అక్రమ కేసులు పెట్టడం, ఇదేనా ప్రజాస్వామ్యం? అని మండిపడ్డారు. ఈ ఘటనపై రాహుల్‌గాంధీ స్పందించకపోతే ఆయన చెప్పున్నవన్నీ ఉత్త మాటలే అనుకోవాల్సి వస్తుందని, ఆయన మోసాలను దేశం మొత్తం చెప్తామని హెచ్చరించారు.

ఉల్టా నాపైనే కేసు పెడ్తారా?: కౌశిక్‌రెడ్డి

'నా ఇంటిపై దాడి జరిగిందని పోలీసులకు ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్తే నన్ను అడ్డుకున్నది పోలీసులే. తిరిగి విధులకు ఆటంకం కలిగించానంటూ నాపైనే కేసు పెట్టడం దారుణం' అని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చెప్పారు. గురువారం రాత్రి ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తన ఇంటిపైకి దాడి చేసేందుకు వచ్చారని చెప్పారు. తన ఇంటి నుంచి గాంధీ ఇంటికి 15 కిలోమీటర్ల దూరం ఉంటుందని, అక్కడి నుంచి వచ్చే సమయంలో పోలీసులు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. తనను హౌజ్ అరెస్టు చేసి, గాంధీకి బందోబస్తు ఇచ్చి తన ఇంటికి పోలీసులు తీసుకొచ్చారని, ఇది దేనికి సంకేతమని ప్రశ్నించారు. తన ఇంటిపై దాడి చేయడం, బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేయడంతో తెలంగాణలో మరో ఉద్యమం మొదలైనట్టేనని చెప్పారు. పోలీసులు రేవంత్‌రెడ్డి కోసం పనిచేస్తున్నారని, ప్రజల కోసం పనిచేయాలని హితవు చెప్పారు. రేవంత్ కూడా తన ఇంటికి వందల సార్లు వచ్చి వెళ్లారని, గతాన్ని గుర్తు చేసుకోవాలని, పీసీసీ అధ్యక్షుడు అయ్యేందుకు ఎవరు సహకరించారో గుర్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ఏం చేస్తాడో చేసుకోవాలని, తనను చంపినా సరే లొంగేది లేదని అన్నారు. అరికెపూడి తెలంగాణలో ఎలా తిరుగుతారో చూస్తామని, చర్యకు ప్రతిచర్య ఉంటుందని హెచ్చరించారు.

> 'రేవంత్.. నిన్ను హెచ్చరిస్తున్నా.. దాడి చేసిన గూండాలను అరెస్ట్ చెయ్.. వారికి సహకరించిన పోలీసులపై యాక్షన్ తీసుకో.. లేకపోతే ఢిల్లీకి వెళ్లి రాహుల్ గాంధీ ఇంటి ముందు, ఏఐసీసీ కార్యాలయం ముందు ధర్నా చేస్తాం. కాంగ్రెస్ పాలనలో ఎమ్మెల్యేలను ఎలా కొంటున్నారో దేశం మొత్తం తెలిసేలా చేస్తాం'
>
> -హరీశ్‌రావు

నేడు గాంధీ ఇంట్లోనే సమావేశం..

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నివాసంలోనే శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ సమావేశం నిర్వహిస్తామని, పార్టీ నేతలు, కార్యకర్తలు తరలిరావాలని కౌశిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంటి నుంచి గాంధీ ఇంటికి వెళ్దామని చెప్పారు.

బాధితులపై కేసులా?: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. దాడి చేసిన అరికెపూడి గాంధీకి పోలీసులు రాచమర్యాదలు చేశారని, బాధితుడైన కౌశిక్‌రెడ్డిపై రివర్స్ కేసు పెట్టారని మండిపడ్డారు. సినిమా డైరెక్టర్‌లా రేవంత్‌రెడ్డి చేస్తున్నాడని, పోలీసుల వెనుక ఉన్నది ఆయనే అని ఆరోపించారు. హరీశ్‌రావు నేతృత్వంలోని బృందం కౌశిక్‌రెడ్డి తరపున సీపీకి ఫిర్యాదు చేసేందుకు వస్తే ఎలాంటి కారణం లేకుండా అరెస్టు చేశారని, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి సహా అనేక మంది పెద్దలను నాలుగు గంటలపాటు పోలీసులు అడవుల్లో తిప్పాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.

> **'ఇంటిమీదకు వస్తామని ప్రెస్‌మీట్‌లో ప్రకటించిన గాంధీ తన అనుచరులతో దాడిచేసినప్పటికీ నిలువరించడంలో ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ తీవ్రంగా విఫలమైంది. పట్టపగలు ప్రజాప్రతినిధి మీద జరిగిన ఈ దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే కౌశిక్‌రెడ్డికి క్షమాపణలు చెప్పాలి. దాడి చేసిన గాంధీని, అతని అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలి. కౌశిక్‌రెడ్డికి పూర్తి భద్రత కల్పించాలి.'**
>
> **-హరీశ్‌రావు**

లోకం పోకడ



మాది అక్రమ చదువు కాదు సార్!

నిందితులు ఎంతటివారైనా వదిలిపెట్టం

సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన ఘటనలో నిందితులు ఎంతటివారైనా వదిలిపెట్టబోమని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి స్పష్టం చేశారు. వైరల్ ఫీవర్ కారణంగా ప్రస్తుతం తాను సెలవులో ఉన్నట్టు తెలిపారు. కొండాపూర్ కొల్లా లగ్జూరియా విల్లాస్‌కు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తన అనుచరులతో కలిసి చేరుకొని మూకుమ్మడిగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడారు. దీనిపై స్పందించిన పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి స్పందించారు. ఈ ఘటనపై ఇప్పటికే కేసులు నమోదు చేశామని, దర్యాప్తు జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తెలంగాణ భవన్ ముట్టడికి యత్నం

- చోద్యంచూస్తూ పట్టించుకోని పోలీసులు
- పోలీసుల వైఖరి తీవ్ర అభ్యంతరకరం
- బీఆర్ఎస్ మహిళా నాయకుల ధ్వజం

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): అధికార కాంగ్రెస్ మహిళా నాయకులు గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయమైన తెలంగాణ భవన్ ముట్టడికి యత్నించారు. రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత ఆధ్వర్యంలో మహిళలు తెలంగాణ భవన్ ముందుకొచ్చి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై ముట్టడికి యత్నించారు. అధికార పార్టీ మహిళా నాయకులు కావడంతో పోలీసులు చోద్యం చూస్తూ కూర్చున్నారు. వారి ముట్టడికి పూర్తిగా సహకరించారు. ఎలాంటి అడ్డంకులూ కల్పించలేదు. బీఆర్ఎస్ నాయకులను అభ్యంతరకరంగా వ్యాఖ్యలు చేస్తున్నా వారిని వారించలేదు. దీంతో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. వారందరూ మీడియాతో మాట్లాడిన తర్వాత వారిని పోలీస్ వాహనంలో అక్కడి నుంచి తరలించారు. ఒక రాజకీయ పార్టీ కార్యాలయం వద్ద మరో పార్టీ కార్యకర్తలు ఆందోళన చేయడానికి ప్రయత్నించినా పోలీసులు పట్టించుకోకపోవడంపై బీఆర్ఎస్ మహిళా నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు చోద్యంచూస్తూ వారికి సహకరించారే కానీ అడ్డుకోవడానికి ప్రయత్నించలేదని చెప్పారు. అధికార పార్టీ కార్యాలయం వద్దకు ఇతర పార్టీల నాయకులను వెళ్లనిస్తారా? ముట్టడి చేయనిస్తారా? అంటూ పోలీసుల వైఖరిని ప్రశ్నిస్తున్నారు.

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై కేసు

- మరో 14 మంది అనుచరులపైనా ఎఫ్ఐఆర్‌లు
- ఎమ్మెల్యే కౌశిక్ ఇంటిపై దాడి ఘటనపై నమోదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ సహా పోలీసులూ ఫిర్యాదు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): బీఆఎర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడి ఘటనలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహా 15 మంది ఆయన అనుచరులపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదుచేశారు. కౌశిక్‌రెడ్డితోపాటు గచ్చిబౌలి పోలీసులు సైతం ఎమ్మెల్యే గాంధీ, అతడి అనుచరులపై ఫిర్యాదులు చేయడంతో ఈ ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. దాడి, హత్యాయత్నం చేసినట్టు కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు చేయగా, తమ విధులకు ఆటంకం కలిగించినట్టు గచ్చిబౌలి ఎస్ఐ మహేశ్‌కుమార్‌గౌడ్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు వేర్వేరు ఫిర్యాదులపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే గాంధీ సహా 15 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు నమోదు చేసిన సెక్షన్లు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతోపాటు అతడి అనుచరులు ఉప్పలపాటి శ్రీకాంత్, బీ గౌతమ్‌గౌడ్, రాంపల్లి వెంకటేశ్, జీ రాములు, నరేశ్, మేల శివ, రాధిక, మంజుల, చంద్రికగౌడ్, రంగం నాగేందర్‌యాదవ్, డీ వెంకటేశ్ గౌడ్, అశ్రఫ్, రఘునాథ్‌రెడ్డి, మోహన్‌గౌడ్ తదితరులపై 109(1), 189, 191(2), 191(3), 132, 329, 333, 324(4), 324(5), 351(2), రెడ్‌విత్ 190 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులను నమోదు చేశారు.

పోలీసుల ఫిర్యాదు మేరకు..

తమ విధులకు ఆటంకం కలిగించారంటూ గచ్చిబౌలి ఎస్ఐ మహేశ్‌కుమార్‌గౌడ్ ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే గాంధీ సహా 15 మందిపై 189, 191(2),191(3), 61, 132, 329,333, 324(4), 324(5), 351(2) రెడ్‌విత్ 190 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. దీంతో దాడికి పాల్పడిన గాంధీ, అతడి అనుచరులపై రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

ఎఫ్ఐఆర్‌లో ఎమ్మెల్యే గాంధీ కుమారుడి పేరేది?

కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడిలో పాల్గొన్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కుమారుడు పృథ్వీని తప్పించే విధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. దాడి ఘటనలో స్పష్టంగా కనిపిస్తున్న పృథ్వీ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చకపోవడంపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పక్షపాత ధోరణి వదిలి వెంటనే దాడికి పాల్పడిన పృథ్వీపైనా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

హైదరాబాద్‌లో ఆంధ్రా ఫ్యాక్షనిజం..!

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశికిరెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే గాంధీ వర్గీయుల దాడి
- అద్దాలు, పూలకుండీలు ధ్వంసం
- గుండె ఆపరేషన్ జరిగిన కౌశిక్ మామ కృష్ణారెడ్డిఉన్న గదిలోకి రాళ్లు



కాంగ్రెస్ మూకల దాడిలో పగిలిన అద్దాలను చూపిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మామ కృష్ణారెడ్డి

కొండాపూర్, సెప్టెంబర్ 12:

ఉదయం పదకొండున్నర గంటలు.. రద్దీగా ఉన్న హైదరాబాద్ నగర రహదారులు.. 20 వరకు తెల్లటి ఇన్నోవా వాహనాలు.. వాటికి ముందు ఉన్న వాహనాల్లో ఇన్నోవాలను చిత్రీకరిస్తూ కెమెరాలు.. పుట్‌బోర్డులపై నిలబడి చేతులు ఊపుకుంటూ... కోపంగా చూస్తూ.. ఎనిమిది జంక్షన్లను ఎలాంటి ట్రాఫిక్ జాం లేకుండా దాటుకుంటూ వెళ్తున్న వాహన శ్రేణిని ఆశ్చర్యంగా చూస్తున్న వాహనదారులు..

ఇదేదో... తెలుగు ఫ్యాక్షన్ సినిమాలో సన్నివేశం అనుకుంటున్నారా? ఇదంతా హైదరాబాద్ నడిబొడ్డున శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఆయన కుమారుడు పృథ్వీతో పాటు అనుచరగణం గురువారం చూపించిన ఆంధ్రా ఫ్యాక్షనిజం. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మీద దాడి చేసేందుకు వేసుకున్న భారీ స్కెచ్. కూకట్‌పల్లి వివేకానందనగర్ నుంచి 9 కిలోమీటర్ల దూరంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ వరకు లక్షలాది మంది నిశ్చేష్టులై ఈ భయానక దృశ్యాలను చూశారు. వాహన శ్రేణికి ఇబ్బంది కలగకుండా 8 జంక్షన్లలో సిగ్నల్ ఫ్రీతో సైబరాబాద్ పోలీసులు సహకరించడంతో 20 నిమిషాల్లోనే కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసం కొల్ల లగ్జరీ విల్లాస్‌కు వాహనాలన్నీ చేరుకున్నాయి. పోలీసులు అడ్డుకున్నట్టుగా ప్రయత్నించగానే.. కొందరు గేటు ఎక్కడం, మరికొందరు గేటును తన్నుకుంటూ లోపలికి వెళ్లారు. అరికెపూడి పృథ్వీ, అనుచరులు కౌశిక్‌రెడ్డి విల్లా దగ్గరికి వెళ్లి పథకం ప్రకారం సంచుల్లో తెచ్చుకున్న టమాటాలు, కోడిగుడ్లను కౌశిక్‌రెడ్డి, ఆయన ఇంటిపై విసిరారు. ఇంటి ముందు ఉన్న పూలకుండీలను ధ్వంసం చేసి, రాళ్లతో ఇంటి అద్దాలను పగులగొట్టారు. కౌశిక్‌రెడ్డి, ఆయన పక్కన ఉన్న బీఆర్ఎస్ నాయకులపైనా రాళ్లు విసిరారు. 2 గంటల పాటు బీభత్సాన్ని సృష్టించిన ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది.

సవాళ్లు.. ప్రతిసవాళ్లు...

బీఆర్ఎస్ పార్టీ నుంచి శేరిలింగంపల్లి నుంచి గెలుపొందిన గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన పీఏసీ (పబ్లిక్ అకౌంట్ కమిటీ) చైర్మన్ పదవికి ఎన్నికవడం.. తాను బీఆర్ఎస్‌లో ఉన్నానని ఎమ్మెల్యే గాంధీ చెప్పారు. దీంతో హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, గాంధీ ఇంటికి గురువారం ఉదయం 11 గంటలకు వచ్చి గులాబీ కండువా కప్పి, ఇంటిపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తానని ప్రకటించారు. దీంతో సైబరాబాద్ పోలీసులు ఉదయమే కౌశిక్‌రెడ్డి ఉంటున్న కొండాపూర్ కొల్ల లగ్జరీ విల్లాస్ ఉన్న గేటెడ్ కమ్యూనిటీకి చేరుకొని.. కౌశిక్‌రెడ్డిని గృహ నిర్బంధం చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తానే 12 గంటలకు కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్తానని ముందుగానే ప్రకటించారు. గాంధీ వస్తే తాను సాదరంగా ఆహ్వానించి, భోజనం పెట్టి తెలంగాణభవన్‌కు వెళ్లి ప్రెస్‌మీట్ నిర్వహించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వద్దకు వెళ్తామని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి స్వాగతించారు.

ఎమ్మెల్యే కౌశిక్ ఇంటిపై దాడి...

గేటెడ్ కమ్యూనిటీ లోపలికి వెళ్లాలంటే లోపల ఉన్నవారి అనుమతి ఉంటేనే సెక్యూరిటీ అనుమతిస్తారు. పైగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని గృహ నిర్బంధం చేసిన దరిమిలా ఆయన ఇంటి ముందుతో పాటు గేటెడ్ కమ్యూనిటీ ప్రధాన గేటు వద్ద కూడా భారీగా పోలీసులు మోహరించారు. ఎమ్మెల్యే గాంధీ, ఆయన అనుచరులను సులువుగా పోలీసులు నియంత్రించే అవకాశాలు ఉన్నా.. ప్రధాన గేటు వద్దకు వచ్చాకే పోలీసులు అడ్డుకున్నట్టుగా ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే గాంధీ కొడుకు అరికెపూడి పృథ్వీ, అనుచరులు ప్రధాన గేటుపైకి ఎక్కినా పోలీసులు అడ్డుకోకపోవడంతో సులువుగా లోపలికి వెళ్లిపోయారు. ఆపై ఎమ్మెల్యే గాంధీ ఒకచోట కూర్చుని మీడియాతో కౌశిక్‌రెడ్డిని బూతులు తిట్టుకుంటూ ఉండిపోయారు. పోలీసులు ఆయన చుట్టూ మోహరించారు. ఈలోగా మూడు వాహనాలు గేటుదాటి లోపలికి వచ్చినా పోలీసులు అడ్డుకోలేదు. దీంతో పృథ్వీ, గాంధీ అనుచరులు తాము ముందుగా వాహనాల్లో ఉంచిన సంచులు, కర్రలు, కత్తులు బయటికి తీశారు. పోలీసుల కండ్ల ముందే ఇదంతా జరుగుతున్న ఎవరూ అడ్డుకోలేదు. పృథ్వీ, కొంతమంది అనుచరులు కౌశిక్‌రెడ్డి నివాసం విల్లా-61 వైపు పరుగులు పెట్టి కర్రలు, రాళ్లు, కోడిగుడ్లు, టమాటలతో కౌశిక్ ఇంటిపై దాడి చేశారు. గేటు తాళాలు విరగొట్టారు. ఇంట్లోకి దూసుకెళ్లారు. పని వాళ్లను విచక్షణారహితంగా కొట్టారు.

ప్రణాళిక పూర్తయ్యాకే అదుపులోకి...

వాస్తవానికి అరికెపూడి గాంధీని గేటెడ్ కమ్యూనిటీ బయటనే పోలీసులు నియంత్రించే వీలుంది. అంతమేర బలగాలు ఉన్నాయి. కానీ లోపలికి అనుమతించి కండ్ల ముందు దాడి జరిగినా ప్రేక్షకపాత్ర వహించారు. ఎమ్మెల్యే గాంధీ కుమారుడు పృథ్వీ, అనుచరుల దాడి ప్రణాళిక పూర్తయ్యాక ఎమ్మెల్యే గాంధీ.. క